ఆనందభైరవి - ఆది

రావేకోడల - రట్టడికోడల
పోవేపోవే అత్తయ్యా - పొందులు నీతోచాలును

రంకెలు వేయుచు - రాజులెదుటనీవు
గొంకు కొసరు లేని - కోడలా
పంకజముఖి నీవు - పలు దొడ్డవారిండ్ల
అంకెల దిరిగేవు - అత్తయ్యా

ఈడాడ పదుగురు - నేగురు మగలతో
కూడి సిగ్గు లేని - కోడలా
వాడకు పదుగురి - వలపించుకొని నీవు
ఆడాడ దిరిగేవు - అత్తయ్యా

బొడ్డున బుట్టిన - పూవనికేనిను
గొడ్డేరి తెస్తినే - కోడల
గుడ్డముపైనున్న - కోనేటి రాయని
అడ్డగించుకొంటి - వత్తయ్యా

అత్తా కోడళ్ళ జగడాలు లోకసామాన్యం, తను మోసి, కని, పెంచిన కొడుకుని నడు మంతరంగా వచ్చి కొంగున కట్టుకుంటుందని అత్తకూ, తన సర్వస్వాన్ని అర్పించి అర్ధాంగి కాగా తన భర్తను పూర్తిగా తనకు కాకుండా చేస్తున్నదని కోడలికి పరస్పరం ఈర్ష్యాద్వే షాలు పెరిగి, ఒకరినొకరు దుయ్యబట్టుకుంటూ ఉంటారు. ఒకరి శీలాల నొకరు శంకి స్తూ ఎత్తిపొడుస్తూ ఉంటారు. లక్ష్మి సరస్వతులు ఇక్కడ అత్తాకోడళ్ళు. జగడం వాళ్ళకూ తప్పలేదు. వాళ్ళ సంభాషణ, రణఘోషణ ఈ విధంగా ఉంది.

లక్ష్మి :రావమ్మా సంసారం రట్టు చేసే కోడలా

సరస్వతి: పోవమ్మా అత్తా. నీతో పొందులు (నీవిచ్చే ధనమూలక సుఖాలు) చాల్లే.

లక్ష్మి: రాజులెదురుగా నువ్వు రంకెలు వేస్తూ (రాజాశ్రయులైన కవి పండితుల ముఖవాణి పై ) ఏమాత్రం జంకూ, బిడియం లేకున్నావు.

సరస్వతి:

అత్తయ్యా ! నువ్వు తక్కువదానవా ? డబ్బుగల పెద్ద పెద్ద వాళ్ళ యిళ్ళలో నువ్వు అంకెల్లో లెక్కలలో / సంఖ్యలలో తిరగటం లేదా ?

లక్ష్మి :ఇక్కడా, అక్కడ నువ్వు పదిమంది - పదిహేను మంది మగవాళ్లతో (మొగుళ్లతో) తిరుగుతున్నావే సిగ్గులేని కోడలా (కృతి సరస్వతీ రూపం. కృతి భర్త కృతికన్యాభర్తగనుక సరస్వతికి మొగుళ్లు అని లక్ష్మిచమత్కారం).
సరస్వతి:ఊరికి పదిమందిచేత వలపించుకొని నీవు ఒక్కదగ్గర స్థిరంగా ఉండక అక్కడా, అక్కడా తిరగడం లేదా? (డబ్బున్నవాళ్లు ఊరికి పదిమంది తప్పక ఉంటారు. వారందరూ నీ భర్తలే అని చమత్కారం).
లక్ష్మి :నా భర్త బొడ్డున పుట్టిన ఆ అమాయకపు (బ్రహ్మ) బిడ్డడికోసం నిన్ను తెచ్చుకున్నాను.గొడ్డేరి మోసపోయాను. నా కొడుకును వల్లో వేసుకున్నావు నువ్వు.
సరస్వతి:తల్లీ నువ్వు మాత్రం తక్కువ తిన్నావా. ఏడు కొండలపై నున్న కోనేటిరాయుణ్ణి మంత్రించి,అంతటివాణ్ణి చిన్నపిల్లవాడికివలె నీ ఒళ్లో అడ్డంగా వేసుకుని కులకడం లేదా? (వేంకటపతి నీకు పూర్తిగా కైవసమైన వాడేగా).

అన్నమయ్యగారికి కొంచెం సరస్వతీ పక్షపాతం ఉన్న ట్లుంది. ఈ వాదులో సరస్వతి నే గెలిపించాడు. సరస్వతి లక్ష్మిని గెలిపించింది. వేంకటేశుడు లక్ష్మికి ఓడినవాడైనాడు.